ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించండి

- నగదు, మద్యం పంపిణీని అరికట్టాలి బోగస్ ఓట్లు తొలగించాలి
- కేంద్ర ఎన్నికల కమిషన్‌కు రాజకీయ పార్టీల విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో త్వరలో జరిగే శాసనసభ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వివిధ రాజకీయ పార్టీలు కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరాయి. ఎన్నికల్లో నగదు, మద్యం పంపిణీని అరికట్టేలా గట్టి నిఘా ఉంచాలనీ, దొంగ ఓట్ల తొలగింపు, కొత్త ఓట్ల చేర్పు పారదర్శకంగా ఉండేలా అధికారులను అప్రమత్తంచేయాలని ఇసికి విజ్ఞప్తి చేశాయి. రాష్ట్రంలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ నేతృత్వంలో ఎన్నికల కమిషనర్లు అనుప్ చంద్ర, అరుణ్ గోయల్, ఇతర అధికారులు మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్నారు. సిఇసి బృందం మూడ్రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. మొదటి రోజు మంగళవారం నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయింది. గడువు ముగిసేలోగా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని సిఇసి రాజీవ్ కుమార్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ చేపట్టిన చర్యలను వివరించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో సమస్యలను ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సిఇసి బృందం దృష్టికి తీసుకెళ్లారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిస్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, ఫిరోజ్‌ఖాన్ ఇసి బృందానికి సూచించారు. బోగస్ ఓట్లు, అధికార దుర్వినియోగం, నగదు మద్యం పంపిణీ..తదితర అంశాలను ఇప్పటికే ఇసి దృష్టికి తీసుకెళ్లామని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని తెలిసి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాలను తీసుకొచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తుందని దీన్ని అరికట్టాలని సిఇసిని కోరారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఓటు నమోదు ప్రక్రియ సరిగా జరగలేదని, అధికార బిఆర్ఎస్ పార్టీ అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తుందని బిజెపి ప్రతినిధులు ఓం పాటక్, మర్రి శశిధర్ రెడ్డి సిఇసి బృందానికి ఫిర్యాదు చేశారు. ఇతర రాష్ట్రాల అధికారులకు ఎన్నికల విధులు అప్పగించాలని కోరారు. బోగస్ ఓట్లను తొలగించాలని, ఎన్నికల పరిశీలకులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇసికి సూచించారు. ఎన్నికల్లో నగదు ఏరులై పారుతోందని, దాన్ని కట్టడి చేసేందుకు ఇసి అధిక ప్రాధాన్యతనివ్వాలని సిపిఎం పార్టీ ఇసికి సూచించింది. హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు పంపిణీ చేశారనీ గుర్తు చేశారు. దీనిపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు కులం, మతం పేరుతో ప్రజలను రెచ్చగొడుతున్నాయనీ, వాటిపై సీరియస్‌గా వ్యవహరించాలని బిఎస్పి నేత విజయార్య క్షత్రియ ఇసికి విజ్ఞప్తి చేశారు. డ్రగ్ మాఫియా, లిక్కర్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలన్నారు. బోగస్ ఓట్లను కట్టడి చేయాలని ఆప్ నేత సుధాకర్ కోరారు. ఓటర్ల నమోదులో అవకతవకలను ఇసి దృష్టికి తీసుకెళ్లారు.

తమపార్టీ ఎన్నికల గుర్తు కారును పోలిన ట్రక్ గుర్తుల వల్ల తమకు తీవ్ర నష్టం జరుగుతుందని,దాన్ని ఎవరికీ కేటాయించవద్దని బిఆర్ఎస్ నేత వినోద్ కుమార్ ఇసిని కోరారు. సోషల్‌మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేస్తున్నవారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల వ్యయాన్ని పెంచాలని, రిటర్నింగ్ అధికారులకు పూర్తి అధికారాలివ్వాలని కోరారు. బోగస్ ఓట్ల తొలగింపులో అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని, స్థానికంగా ఉన్న ఓటర్లకు నష్టం జరగకుండా చూడాలని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసి సిఇసి బృందాన్ని కోరారు. ఎన్నికలను నిస్పక్షపాతంగా నిర్వహించాలని టిడిపి, వైఎస్సార్‌టిపి ప్రతినిధులు ఇసికి విజ్ఞప్తి చేశాయి.



సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలతో సిఇసి సమావేశం

రాజకీయ పార్టీలతో సమావేశానంతరం సిఇసి బృందం ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అధికారులతో సమావేశమయింది. త్వరలో ఎన్నికల షెడ్యూల్ వస్తున్న నేపథ్యంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయా ఏజెన్సీలను సిఇసి రాజీవ్ కుమార్ ఆదేశించారు. నిస్పక్షపాతంగా నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని స్పష్టంచేశారు. సమావేశంలో పోలీస్, ఎక్సైజ్, సిబిడిటి, ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్, ఎస్ఎల్‌బిసి, ఆర్‌బిఐ, డిఆర్ఐ, ఇడి, ఆర్‌పిఎఫ్, సిఐఎస్ఎఫ్, ఎఎఐ, ఏవియేషన్ కార్పొరేషన్, రవాణా,అటవీ, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌క్లిక్‌పై దాడికి జర్నలిస్టు సంఘాల ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆన్‌లైన్ పోర్టల్ న్యూస్‌క్లిక్‌కు చైనాతో సంబంధాలు ఉన్నాయంటూ అక్రమ కేసులు పెట్టి దాడులు చేయడాన్ని పలు జర్నలిస్టు సంఘాలు ఖండించాయి. వాస్తవాలు చెబుతూ, ప్రజాసమస్యలను సమాజం దృష్టికి తీసుకుపోవడమే న్యూస్‌క్లిక్ చేసిన నేరమా అంటూ ప్రశ్నించాయి. ఇప్పటికే పలుమార్లు రకరకాల కారణాలతో దాడులకు దిగిన కేంద్రం, తన జేబు సంస్థలను అందుకు పావులుగా వాడుకుంటున్నదని విమర్శించాయి. న్యూస్ క్లిక్ ఆఫీసులు, ఆ సంస్థలో పనిచేసే జర్నలిస్టుల ఇండ్లల్లో ఢిల్లీ పోలీసులు భారీగా సోదాలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేయడాన్ని నిలదీశాయి. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల నుంచి దాడుల చేయాల్సిన అవసరమేంటని అడిగాయి. 500 మంది పోలీసులతో 100 ప్రాంతాల్లో దాడులు చేసి ప్రజాస్వామ్యాన్ని కేంద్రం హత్య చేసిందని ఆందోళన వ్యక్తం చేశాయి. ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్ (ఈడీ)తో దాడీ చేయించిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు ఢిల్లీ పోలీసులను వాడుకోవడాన్ని దివాళాకోరుతనంగా పేర్కొన్నాయి. ఈ మేరకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎం. సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఐఎఫ్‌డబ్ల్యూజె జాతీయ కార్యదర్శి పి.ఆనందం, తెలంగాణ బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టిబిజెఎ) రాష్ట్ర అధ్యక్షులు రాధిక, ప్రధాన కార్యదర్శి జ్యోతిబసు, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజె) అధ్యక్షులు అరుణ్‌కుమార్, కార్యదర్శి బి.జగదీశ్వర్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

నేటి నుంచి మానసిక ఆరోగ్య వారోత్సవాలు

- డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వారం రోజులపాటు మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాలను అక్టోబర్ 4 నుంచి 10 వరకు నిర్వహించనున్నట్టు ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్-ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. నవభారత లయన్స్ క్లబ్, ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో ఏడు రోజులపాటు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మానసిక ఆరోగ్యం సార్వత్రిక హక్కనీ, అది అనారోగ్యం పాలైతే వ్యక్తిత్వాన్ని చంపేస్తుందని తెలిపారు. రామకృష్ణ మఠం బాలల సేవా విభాగం, ఇందిరా పార్క్, ఎస్‌సి బాలికల హాస్టల్లో, మాడపాటి హనుమంతరావు ఉన్నత పాఠశాలలో, మొరంబంద పాఠశాలలో జరుగుతాయని వివరించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు 9390044031/40 ఉచిత ఫోన్ కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ రెండవ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మానసిక వైద్య నిపుణులు జి.మహేంద్రకుమార్‌రెడ్డి, రవ్వ హరికుమార్, సి.హెచ్.గోపాల్‌కృష్ణ, బి. వినయ్, జి. కృష్ణవేణి, స్వరూపారాణి, అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సైకాలజిస్టులు జి.వీరభద్రం, క్యార్లిన్, ఆంధ్ర సైకాలజిస్టులు జనార్ధనం, మహాలక్ష్మీ కుమార్, పి.రమేష్ కుమార్, శ్రీనివాస్, డాక్టర్ లలిత పాల్గొంటారని తెలిపారు.

ఒంటరిగానే బిఎస్‌పి పోటీ

- అభ్యర్థుల తొలి జాబితా విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాబలంతో వచ్చే ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుస్తామని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు రాంజీ గౌతమ్ బిఎస్‌పి అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి, , కాంగ్రెస్ పార్టీలు ఆచరణ కానీ అబద్ధపు హామీలతో మోసపూరిత ప్రణాళికలను ప్రజలెవరు నమ్మొద్దన్నారు. ఈ మేరకు 20 మంది అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేశారు.

5 లక్షల అభ్యర్థులకు...5 వేల పోస్టులా?

- 13 వేలతో మెగా డిఎస్‌సిని ప్రకటించాలి
- రాతపరీక్షలను 4 నెలలు వాయిదా వేయాలి
- కోదండరామ్, ఆర్ఎస్ ప్రవీణ్, ఆర్ కృష్ణయ్య డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఐదు లక్షల మందికిపైగా ఉపాధ్యాయ అభ్యర్థులుంటే, కేవలం 5,089 పోస్టుల భర్తీకే డిఎస్‌సి నోటిఫికేషన్ వేయడం సమంజసం కాదని టిజెఎస్ అధినేత కోదండరామ్, బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, కాంగ్రెస్ అధికార ప్రతినిధి రియాజ్ అన్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి కెసిఆర్ హామీ ఇచ్చినట్టుగా 13,086 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద డిఎస్‌సి అభ్యర్థుల బహిరంగసభను నిర్వహించారు. 'వియ్ వాంట్ మెగా డిఎస్‌సి, సిఎం ప్రకటించిన 13 వేల పోస్టులను భర్తీ చేయాలి' అని పెద్దఎత్తున నినాదాలు చేశారు. 'సమయమేమో గోరంత, సిలబస్ ఏమో కొండంత, మాకు మినీ డిఎస్‌సి వద్దు, మెగా డిఎస్‌సి కావాలి, వైన్స్ దుకాణాల సంఖ్య పెంచారు, ఉపాధ్యాయ ఖాళీలను పెంచలేరా?, ఆరేండ్లు ఆగినం, ఆర్నెల్లు ఆగలేమా?, నవంబర్‌లోనే గ్రూప్-2, ఫిజికల్ డైరెక్టర్ పరీక్షలున్నందున డిఎస్‌సిని వాయిదా వేయాలి' అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కోదండరామ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆర్. కృష్ణయ్య, రియాజ్ మాట్లాడుతూ డిఎస్‌సిని ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాతపరీక్షల నిర్వహణకు నాలుగు నెలల సమయం కేటాయించాలని కోరారు. ఉపాధ్యాయ పోస్టులను పెంచి కొత్త నోటిఫికేషన్ విడుదల చేసే వరకు నిరుద్యోగుల తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. సీఎం చెప్పిన లెక్కల ప్రకారం 13,086 పోస్టులతోపాటు ఇటీవల ఉపాధ్యాయుల పదోన్నతులతో ఏర్పడిన 9,979 పోస్టులనూ కలిపి '23065' ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వెంటనే భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేష్, తెలంగాణ రాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో గుజ్జకృష్ణ, నందగోపాల్, శివకృష్ణ, శశిధర్, హరీశ్, స్వప్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్ట పరిరక్షణపై మ్యానిఫెస్టోల్లో చేర్చాలి

- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షిస్తామనీ, బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తామని అన్ని రాజకీయ పార్టీలూ వచ్చే ఎన్నికల సందర్భంగా తమ మ్యానిఫెస్టోల్లో చేర్చాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఢిల్లీలోని రాజారామ్మోహన్‌రాయ్ హాల్‌లో నరేగా సంఘర్ష్ మోర్చా జాతీయ మొదటి మహాసభలు ప్రారంభమయ్యాయి. అందులో పి.శంకర్ మాట్లాడుతూ..అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, ఐఎఫ్‌టియు, ఎఐటియుసి, అమెజన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధి హామీల పోరాటానికి మద్దతు ప్రకటించాయని తెలిపారు. ఎన్ఎంఎంఎస్‌ను రద్దు చేయాలనీ, ఆధార్ సీడింగ్ పేరుతో వేతనాల జాప్యాన్ని నివారించాలనీ, నిధులను పెంచాలని, పట్టణ పేదలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని మహాసభ డిమాండ్ చేసిందని చెప్పారు. ఉపాధి చట్టాన్ని ఎత్తివేసేందుకు మోడీ సర్కారు కుట్ర చేస్తున్నదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ, కూలీలకు పనులు చూపకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ఆన్‌లైన్ హాజరు, అధార్ సీడింగ్, పనులను డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతూ ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నదన్నారు. ఆలస్య వేతనాలకు నష్ట పరిహారం, పనులు చూపకపోతే నిరుద్యోగభృతి చెల్లించడం లేదన్నారు. తెలంగాణలో ఐదు లక్షల కూలీల కుటుంబాల జాబ్‌కార్డులను తొలగించడం ఉపాధి హామీ చట్టాన్ని ఉల్లంఘించడమేన్నారు. అవినీతిని ఆరికట్టేందుకు సామాజిక తనిఖీలు చేపట్టడం లేదన్నారు. 200 రోజుల పనిదినాలు, రోజుకు రూ.800 వేతనం, పనిప్రదేశాల్లో హక్కుగా కనీస సౌకర్యాల ఏర్పాటు హామీలను మ్యానిఫెస్టోల్లో పెట్టాలన్నారు. ఉపాధి హామీ చట్ట పరిరక్షణ చాప్టర్‌ను అన్ని రాజకీయ పార్టీలకూ అందజేస్తామని తెలిపారు.

బిఆర్ఎస్, కాంగ్రెస్ తెరవెనుక నాటకాలు

- బిజెపి జనగర్జన సభలో ప్రధాని మోడీ

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కెసిఆర్ తెలంగాణ ఖజానా అందించారని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విమర్శించారు. కాంగ్రెస్ విజయానికి కెసిఆర్, ఒవైసి కృషి చేశారని, ఓట్లు కొనే కాంట్రాక్టుకు తెర వెనుక ఉండి సహకరించారని ఆరోపించారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలవి తెరవెనుక నాటకాలని విమర్శించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ప్రధాని మోడీ పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం చేపట్టి జాతికి అంకితం చేశారు. అనంతరం జిజి కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన బిజెపి జనగర్జన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. దేశాభివృద్ధిలో తెలంగాణ పాత్ర కీలకమని, కరోనా సమయంలో వ్యాక్సిన్‌ను ప్రపంచానికి అందించిన కీర్తి తెలంగాణకు దక్కిందని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందు తుందన్నారు. బహిరంగ సభలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపి ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, డికె అరుణ, బిజెపి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణగుప్త పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

రేపటి నుంచి 'ఎస్‌ఎ-1' పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్‌ఏ-1) పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 11 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. సవరించిన టైంటేబుల్‌ను ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి మంగళవారం విడుదల చేశారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థుల వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆరో తరగతి వారికి ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.45, ఏడో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.45, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12.45, తొమ్మిదో తరగతి వారికి మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4.30, పదో తరగతి విద్యార్థులకు ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 30న ఫలితాలను ప్రకటించాలని వివరించారు. ఈ నెల 13 నుంచి 25 వరకు విద్యార్థులకు దసరా సెలవులుంటాయి.

పర్మినెంట్ చేయాల్సిందే

- మున్సిపల్ కార్మికులని చిన్నచూపు చూస్తే వదలబోం
- సమస్యలను పరిష్కరించకుంటే 8 నుంచి సమ్మె
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'చాలా ఏండ్ల నుంచి పనిచేస్తున్నారని విఆర్ఎలు, లెక్చరర్లు, పలువురు కాంట్రాక్టు ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేసింది. మంచిదే. స్వాగతిస్తున్నాం. తాతల కాలం నుంచి అదే పనిగా బతుకుతున్న మున్సిపల్ కార్మికులు ఇంకెంత కాలం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా బతకాలి. ఇదెక్కడి న్యాయం. గొడ్డుచాకిరీ చేస్తున్న మున్సిపల్ కార్మికుల మీద చిన్నచూపు ఎందుకు? వారం రోజులు పని బంద్ చేస్తే కోటి మందికిపైగా జనం ఇబ్బంది పడతారు. దీన్ని ప్రభుత్వం గుర్తెరగాలి. మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి. లేకుంటే కెసిఆర్ ప్రభుత్వాన్ని వదలబోం' అని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. వేలాది మంది మున్సిపల్ కార్మికులు తరలొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లాలని తీర్మానించారు. ధర్నానుద్దేశించి భాస్కర్ మాట్లాడుతూ..కరోనా కాలంలో ప్రజల కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా మున్సిపల్ సిబ్బంది సేవలందించారని గుర్తుచేశారు. మిగతా రాష్ట్రాల కంటే ఎక్కువ వేతనాలు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటే సరిపోదనీ, కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇస్తున్నదని ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తన వేతనాన్ని పెంచుకున్న సీఎం, ఎమ్మెల్యేలకు మున్సిపల్ కార్మికులు కూడా మనుషులే, వాళ్ల బతకడానికి కూడా జీతాలు పెంచాలనే సోయి ఎందుకు లేదని నిలదీశారు. ఉద్యోగులకు ఐఆర్ ఐదు శాతమే అంటే వారిని మోసం చేయడమేనన్నారు. జీవోను సవరించి దాన్ని కనీసం 20 శాతానికి పెంచాలనీ, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ దాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్. కార్మికులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరారు.



ధర్నాలో మాట్లాడుతున్న భాస్కర్

తెలంగాణ రాష్ట్ర శ్రామిక మహిళా సమన్వయ కమిటీ (సిఐటియు) కన్వీనర్ ఎస్‌వి.రమ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, ఆ లోపు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షన్నర మందికిపైగా స్కీం వర్కర్లు సమ్మెలో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. పనికి తగ్గ ఫలితం, పర్మినెంట్ అడగటం తప్పా అని ప్రశ్నించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్ మాట్లాడుతూ.. జిహెచ్‌ఎంసిలోని 26 వేల మంది, రాష్ట్రంలోని మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలోని 65 వేల మంది కార్మికులు పారిశుధ్య సేవల్ని ఆపేస్తే కోటి మంది ఆరోగ్యం మీద ప్రభావం పడదా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మూడు శాతం మంది ఉద్యోగులే అని చిన్నచూపు చూస్తే వారే తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఢిల్లీలో 19 వేలు, ఏపీలో 21 వేలు, కేరళలో రూ.26 వేలను మున్సిపల్ కార్మికులకు ఇస్తున్నారని గుర్తుచేశారు. ఇక్కడ కూడా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు మాట్లాడుతూ..సిఎం ఒక్కరోజు వేతనం తమకు నెల జీతంతో సమానమన్నారు. మున్సిపల్ కార్మికులకు కూడా తిండికీ, బట్టకీ, పిల్లల చదువులకు సరిపోయేలా జీతాలు ఇవ్వాలి కదా అని అడిగారు. మన సఫాయి కార్మికులు త్యాగమూర్తులనీ, సఫాయి అన్న లేకుంటే తెలంగాణ సమాజానికి ఎంతో ప్రమాదమనీ, వారిని పర్మినెంట్ చేస్తామన్న హామీలు ఏమయ్యాయని సిఎంను ప్రశ్నించారు. ఈ ధర్నాలో మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రా నర్సింహులు, ఉపాధ్యక్షులు పాలడుగు సుధాకర్, నాగమణి, డి. కిషన్, జి. శ్రీను, గుర్రం అశోక్, టి. ఉప్పలయ్య, పుట్టా ఆంజనేయులు, ఎ. వెంకటేష్, ఆర్. వాణి, సిఐటియు రాష్ట్ర నాయకులు పి.శ్రీకాంత్, యాటల సోమన్న, ఎ.సునీత, యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు రాజనర్సు, ఎస్. వెంకటస్వామి, ఎం. శ్రావణ్ కుమార్, యాదమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

5న చలో డైరెక్టరేట్

- వైద్యారోగ్యశాఖలో జిఓ 142 రద్దు చేయాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖలో జిఓ 142ను రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన డాక్టర్లు, పారామెడికల్ ఉద్యోగుల యూనియన్స్, అసోసియేషన్స్‌ల రౌండ్ టేబుల్ సమావేశానికి కె.యాదానాయక్ (సిఐటియు) అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో డాక్టర్ల యూనియన్ నుండి డాక్టర్ బి రమేష్, డాక్టర్ లాలు ప్రసాద్ (డాక్టర్స్ యూనియన్), కె.సాయి రెడ్డి, రాజశేఖర్, రాబర్ట్ బ్రూస్ (టిఆర్ఎస్కెవి), కె.యాదానాయక్, బలరాం (సిఐటియు) శ్యాంసుందర్, వెంకటేశ్వర రెడ్డి (ఐఎన్‌టియుసి), భరత్ సత్యనారాయణ, చంద్ర ప్రకాష్ (సిహెచ్ఒల అసోసియేషన్), కొప్పు ప్రసాద్ (హెల్త్ ఎక్స్‌టెన్షన్ మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్), రామేశ్వరి (ఎఎన్ఎం, హెచ్‌వి, పిహెచ్ఎన్ అసోసియేషన్), రామలక్ష్మి (ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్), వీరారెడ్డి (ఫార్మసిస్టుల అసోసియేషన్), శ్రీనివాస్ (బిసి ఉద్యోగుల అసోసియేషన్), తిరుపతి (ఎస్‌టి ఎంప్లాయిస్ అసోసియేషన్) పాల్గొన్నారు. జిఓ 142ను రద్దు చేయాలనీ, అక్టోబర్ 5న ఉదయం 10 గంటలకు చలో డైరెక్టరేట్ నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. చలో డైరెక్టరేట్‌ను విజయవంతం చేయాలని కోరింది. ఈ సమావేశంలో డాక్టర్ వసంత్, డాక్టర్ అన్నపూర్ణ, అశోక్, ప్రకాష్, గుండయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. సమస్య పరిష్కారం కోసం వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావులను కలిసి ప్రయత్నించినట్టు తెలిపారు. అధికార యంత్రాంగం నుంచి సరైన సమాధానం లభించకపోవడం, నిర్లక్ష్య వైఖరి ఉద్యోగ సంఘాల నాయకులను అనివార్యంగా ఐక్య ఉద్యమాల వైపుకు నడిపించిందని తెలిపారు. వైద్యారోగ్యశాఖలో కార్మిక సంఘాలు, క్యాడర్ సంఘాలు జిఓ 142 రద్దు పోరాట కమిటీగా ఏర్పడి సమ్మె నోటీస్ ఇచ్చాయని వారు గుర్తుచేశారు. దేశంలోనే అత్యంత మలేరియా ప్రభావిత ప్రాంతాలైన భద్రాచలం, ములుగు, ఆసిఫాబాద్ వంటి ఏజెన్సీ జిల్లాలకు జిల్లా మలేరియా అధికారి, మలేరియా సబ్ యూనిట్ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డివిజన్లలో పర్యవేక్షించే 63 డిప్యూటీ డిఎంహెచ్‌ఒలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పిహెచ్‌సి, యుపిహెచ్‌సిలలో జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్లను తీసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటలు నడిచే పిహెచ్‌సిల్లో నైట్ వాచ్‌మెన్‌తో పాటు అనేక రకాల పోస్టులను తీసేశారని తెలిపారు. 1,217 పోస్టులను సూపర్ న్యూమరరీగా చూపిస్తూ రద్దు చేస్తే ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ ఏ విధంగా బలోపేతమవుతుందని ప్రశ్నించారు.



సాహిత్య ప్రపంచంలో విశ్వనాథ ముద్ర శాశ్వతం

ప్రజాశక్తి - కల్చరల్

సాహిత్య ప్రపంచంలో విశ్వనాథ సత్యనారాయణ తన ముద్రను శాశ్వతం చేసుకున్నారని సమాచార హక్కు కమిషన్ పూర్వ ముఖ్య సంచాలకుడు బుద్ధ మురళి అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో భాగంగా విశ్వనాథ సత్యనారాయణ సంస్మరణ సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా మురళి పాల్గొని మాట్లాడుతూ వ్యాస కర్తగా కథకునిగా నవలా రచయితగా కవిగా సాహితీ సేద్యం చేసిన విశ్వనాథ తాను నమ్మిన ఆచార సంప్రదాయ పద్ధతులకు రాజీపడకుండా రచనలు చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ విశ్వనాథ రచించిన వేయి పడగలు సుదీర్ఘ నవలను సహస్ర ఫన్ పేరిట పూర్వ ప్రధాని పివి నరసింహారావు హిందీలోకి అనువదించారని గుర్తు చేశారు. జర్నలిస్ట్ జయసూర్య మాట్లాడుతూ విశ్వనాథ రచించిన రామాయణ కల్ప వృక్షం మహా కావ్యం అని విశ్లేషించారు గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన వేదిక పై సంగీత గురువు అపర్ణ పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం ఉద్యమం

- 33 శాతం రిజర్వేషన్లు 2024 ఎన్నికల్లో అమలు చేయాలి
- మల్లు లక్ష్మి డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా హక్కుల కోసం ఉద్యమించాలని, 33 శాతం రిజర్వేషన్లను 2024 ఎన్నికల్లో అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు.' బిజెపి, బిఆర్ఎస్‌ను గద్దె దించుదాం, మహిళలను, దేశాన్ని రక్షించుకుందాం' అంటూ చలో ఢిల్లీ కార్యక్రమానికి ర్యాలీగా బయలు దేరారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ బిజెపి, బిఆర్ఎస్ పాలకుల విధానాల నుంచి మహిళలను, దేశాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. వీరి విధానాల వల్ల మహిళలపై నిత్యం దాడులు, దౌర్జన్యాలు, లైంగిక దాడులు నిత్యకృత్యమయ్యాని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా మహిళా రిజర్వేషన్ల కోసం పోరాటాలు నిర్వహిస్తున్నా.. పట్టించుకోని వారు రిజర్వేషన్ల చట్టం చేశారని, అయితే.. ప్రస్తుత ఎన్నికల్లో అమలు చేయ కుండా కాలయాపనకు కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా పోరాటాల ఫలితంగా వచ్చిన రిజర్వేషన్లను 2024 ఎన్నికల్లో అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. మహిళలు ఏమి మాట్లాడాలి, ఏ ఆహారం తినాలి, ఏ బట్ట కట్టాలన్నది బిజెపి నాయకులు శాసిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఈ పద్ధతి తగదని హితవు పలికారు. మరో పక్క నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి పేదలపై భారాలు మోపుతున్నారని, వీటిపై దృష్టి పెట్టకుండా మహిళలను కించపరిచే విధంగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు.

ఎమ్మెల్యేల కార్యాలయాల ముట్టడి

- ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని ఆశాల డిమాండ్
- సమస్యలను పరిష్కరించాలని వినతి
- పలుచోట్ల అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలి.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.. పారితోషికంలో లేని పనులను తమతో చేయించొద్దు.. ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు మంగళవారం తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంత్రులు, ఎమ్మెల్యేల కార్యాలయాలను ముట్టడించారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేరు. ఈ సందర్భంగా పలుచోట్ల పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. యూనియన్ సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో నల్ల జెండాలు పట్టుకుని ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్‌టిసి క్రాస్ రోడ్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన మధ్యంతర భృతిలో ఆశాల పేరు లేకపోవడం వారిని దగా చేయడమే సిఐటియు నేతలు అన్నారు. ర్యాలీకి వస్తున్న 40 మంది ఆశాలను సికింద్రాబాద్ రేతి ఫైల్ బస్ స్టేషన్ వద్ద అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని ఉద్యమాలను అణచివేయాలని చూస్తే ప్రజలు బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని హుస్సేన్ సాగర్‌లో ముంచుతారని హెచ్చరించారు. ర్యాలీ అనంతరం ఆశా వర్కర్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇతర నియోజకవర్గాల ఎమ్మెల్యేలకూ వినతిపత్రాలు అందజేశారు. బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలోని మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట



ఆశావర్కర్లు రిక్షా తొక్కుతూ నిరసన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం వినతిపత్రాన్ని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు ఇచ్చారు. చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేశారు.

హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్ క్యాంప్ ఆఫీస్ ఎదుట ఆశాలు ధర్నా చేపట్టారు. తొలుత పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. దీంతో అక్కడే బైటాయించారు. చివరకు పోలీసులు వారిని వినయ్‌భాస్కర్ వద్దకు తీసుకెళ్లారు. పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఇంటి వద్ద ధర్నా చేశారు.

ఖమ్మంలోని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ క్యాంప్ కార్యాలయం వద్దకు ధర్నాకు వెళ్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే బైటాయించారు. ఆశాలను లోపలికి అనుమతివ్వాలని డిమాండ్ చేశారు. పోలీసులు, ఆశా కార్యకర్తలకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. అనంతరం టూ టౌన్ సిఐ ఆశాలను మంత్రి వద్దకు తీసుకెళ్లగా వినతిపత్రం అందజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి తెలిపారు. వైరాలో ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట బైటాయించిన నిరసన తెలిపారు. భద్రాచలంలో ఆశా కార్యకర్తలు ఎమ్మెల్యే కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అశ్వారావుపేటలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఇల్లందులో ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యే బయటకు వచ్చి వారి సమస్యలు విన్నారు.

ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే ఆత్రం సక్కు క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ఆయన లేకపోవడంతో ప్రధాన ద్వారానికి వినతిపత్రాన్ని అంటించారు. ఖానాపూర్ పట్టణంలో ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకునికి వినతిపత్రాన్ని అందించారు. నిర్మల్‌లో ర్యాలీగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి క్యాంపు కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు.

గృహలక్ష్మిపై ప్రశ్నించిన మహిళ పట్ల ఎమ్మెల్యే దురుసు వ్యాఖ్యలు

- దుఃఖంతో వెళ్లిపోయిన బాధితురాలు



మహిళను బయటకు నెడుతున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే భాస్కరరావు మహిళ పట్ల దురుసు వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతున్న సమయంలో.. గ్రామానికి చెందిన వనం విజయ తనకు గృహలక్ష్మి పథకం కింద పేరు నమోదైతే తొలగించారని ఆవేదన వెలి బుచ్చింది. ప్రసంగం మధ్యలో మాట్లాడటం తో అసహనానికి గురైన ఎమ్మెల్యే ఆమెపై ఆగ్రహంతో ఊగిపోయారు. 'పనికిమాలిన దానా.. నీకు ఇల్లు పెట్టను పో.. ఏం చేసుకుంటావో చేసుకో.. దాన్ని బయటకి నెట్టేయండి' అంటూ మరింత అసభ్యకరంగా వ్యవహరించారు. అక్కడే ఉన్న పోలీసులు ఆమెను బలవంతంగా బయటకు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ప్రవర్తించిన తీరు పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీరయ్య

పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాల్సిందే

జిఒ నెం 58, 59 అమలు చేయాలి : వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాల్సిందేనని, జిఒ నెం 58, 59 అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జయశంకర్-భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పాత ఎర్ర చెరువులోని సర్వేనెంబర్-280, 282, 283, 284, 285లో పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు, రాష్ట్రవ్యాప్తంగా 66 కేంద్రాల్లో సిపిఎం ఆధ్వర్యంలో గుడిసెల పోరాటం కొనసాగుతోందన్నారు. వరంగల్ జిల్లాలోని జక్కలొద్ది భూ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు 58, 59 జిఒ ప్రకారం ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాదిగా ప్రజలు ఎండనక, వాననక కారు చీకట్లోనూ ఎన్నో కష్టాలనోర్చుకుని గుడిసెలల్లో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి శ్రీనివాస్ యాదవ్ పలు సమావేశాలలో మాట్లాడుతూ పేద ప్రజలకు ఇళ్లు ఇచ్చిన ప్రభుత్వమేదైనా ఉన్నదంటే అది కెసిఆర్ ప్రభుత్వమేనని, దేశంలో ఏ రాష్ట్రం ఇలా చేయలేదని, ఒకవేళ చేసినట్టు చూపెడితే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని చెప్పినట్టు గుర్తు చేశారు. ధనిక రాష్ట్రం అని గొప్పలు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న రూ.ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.పది లక్షలు.. మొత్తం రూ.15 లక్షలు ఇల్లు కట్టుకోవడానికి ఇవ్వాలని కోరారు. లేదంటే ప్రజలను సమీకరించి ప్రభుత్వాన్ని గద్దెదించే విధంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్. వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పోలం రాజేందర్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశెట్టి రాజయ్య, రజినీకాంత్, గుర్రం దేవేందర్, ఆత్కూరి శ్రీకాంత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలం చిన్న రాజేందర్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు మహేందర్, 2వేలమంది గుడిసె వాసులు పాల్గొన్నారు.

ఎఎన్‌ఎంల అక్రమ అరెస్టులు సరికాదు

- టియుఎంహెచ్‌ఇయు ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుతంగా ధర్నా చేసేందుకు వచ్చిన ఎఎన్‌ఎంలను అరెస్టు చేయడం సరికాదని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టియుఎంహెచ్‌ఇయు - సిఐటియు అనుబంధం) ఖండించింది. ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. హైదరాబాద్‌లోని కోఠి వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కోసం ఎఎన్‌ఎంలు తరలివచ్చారు. అయితే ధర్నాను విచ్ఛిన్నం చేసేందుకు ముందుగానే 500 మందికిపైగా పోలీసులు మోహరించి వచ్చిన వారిని వచ్చినట్టుగానే అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని నగరంలోని ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. అరెస్టయిన వారిలో యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు ఎండీ ఫసియుద్దీన్, హైదరాబాద్ నగర అధ్యక్షులు జె కుమారస్వామి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్మయి, వివిధ జిల్లాల నాయకులు మంగా, లక్ష్మీబాయి, రమా, శీలా, భవాని, ధనలక్ష్మి, రాజేశ్వరి, బాలమణి, దైవమణితో పాటు పలు జిల్లాల నాయకులు ఉన్నారని రాష్ట్ర కమిటీ తెలిపింది. అరెస్ట్ చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ నాలుగు వరకు సమ్మె చేస్తే ప్రభుత్వం కమిటీ వేసిందని, నెల రోజులు గడుస్తున్నా ఆ కమిటీతో ఫలితం లేకపోవడం, పరీక్ష రద్దు కాకపోవడం, ఎరియర్స్, సమ్మె కాలం జీతం ఇవ్వకపోవడంతో ఏఎన్‌ఎంలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారని రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ నేపథ్యంలో డైరెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారని కమిటీ వివరించింది.

నేడు నిరసన


పోలీసుల అక్రమ అరెస్టులు, నిర్బంధానికి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద దీక్షలు చేపట్టాలని కాంట్రాక్ట్ ఎఎన్‌ఎంలకు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది.

మల్లారెడ్డి ఇంటి ముట్టడి

- హామీని నిలబెట్టుకోవాలని భవన నిర్మాణ కార్మికుల ధర్నా
- ద్విచక్ర వాహనాలు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లక్ష మంది భవన నిర్మాణ కార్మికులకు ద్విచక్ర వాహనాలు అందిస్తామని అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్, గౌరవ అధ్యక్షులు వంగూరు రాములు డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు మంగళవారం హైదరాబాద్ న్యూ బోయిన్‌పల్లిలోని మంత్రి మల్లారెడ్డి నివాసం వద్ద ధర్నా చేశారు. ఆ సమయంలో మంత్రిలేరు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మేడే సందర్భంగా భవన నిర్మాణ కార్మికులకు ఒక లక్ష ద్విచక్ర వాహనాలను అందజేస్తామని మంత్రి మల్లారెడ్డి అసెంబ్లీలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ఇప్పటికీ అసెంబ్లీ గేటునూ దాటనివ్వడం లేదన్నారు. ఇప్పటికైనా మంత్రి హామీని వెంటనే అమలు చేసి ఎన్నికల్లోకి వెళ్లాలని, లేదంటే ఎక్కడికక్కడా అడ్డుకుంటామని హెచ్చరించారు. సెస్ మీద వసూలు చేసిన వెల్ఫేర్ బోర్డు డబ్బును సంక్షేమ పథకాల పేరుతో వీటి నుంచి వాటికి బదిలీ చేయొద్దని కోరారు. భవన నిర్మాణ కార్మికులను అన్ని విధాలుగా ఆదుకోవాలని, మహిళా కార్మికులకు ప్రసవం జరిగినప్పుడు రూ.30 వేలు ఇచ్చే దానిని రూ.లక్షకు పెంచాలని, పెళ్లి కానుక రూ.30 వేల నుంచి లక్షకు పెంచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అడ్డాలలో మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, నివాసం ఉండేందుకు షెడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్, ఉపాధ్యక్షులు జె వెంకన్న, సహాయకార్యదర్శులె ఐలాపురం రాజశేఖర్, జె శ్రీనివాసులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాజు, సత్యనారాయణ, లక్ష్మయ్య, ఆనంద్, కృష్ణవేణి, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



మంత్రి మల్లారెడ్డి నివాసం వద్ద ధర్నా చేస్తున్న భయన నిర్మాణ కార్మికులు



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌కెఎం నాయకులు

మంత్రి అజయ్‌కుమార్ మిశ్రాను బర్తరఫ్ చేయాలి

- సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో పలు జిల్లాల్లో నిరసనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లక్కింపూర్ కేరి దుస్సంఘటనలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) ఆధ్వర్యంలో మంగళవారం దేశవ్యాప్తంగా బ్లాక్ డేకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. జనగామ జిల్లా పాలకుర్తి చౌరస్తాలో నిరసన తెలిపారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని మంచికంటి భవన్ నుంచి ప్రదర్శనగా బస్టాండ్ సెంటర్‌కి చేరుకొని అక్కడ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

రూ.40 వేల కోట్ల టర్నోవర్

రూ.3,500 కోట్ల లాభాలు

- మార్చి నాటికి సింగరేణి లక్ష్యం
- సిఎండి ఎన్ శ్రీధర్ వెల్లడి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఈ ఏడాది మార్చి నాటికి రూ.40 వేల కోట్ల టర్నోవర్, రూ.3,500 కోట్ల లాభాలను ఆర్జించాలని సింగరేణి కాలరీస్ సిఎండి ఎన్ శ్రీధర్ లక్ష్యాన్ని నిర్దేశించారు. దీని సాధన కోసం 720 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించాలని, దానికనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారుల్ని ఆదేశించారు. మంగళవారం సింగరేణి భవన్ నుంచి ఆయన అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ఆరు నెలల్లో బొగ్గు రవాణాలో 12 శాతం, ఉత్పత్తిలో ఏడు శాతం, ఒబి తొలగింపులో 15 శాతం వృద్ధి సాధించినట్టు తెలిపారు. ఇకపై రోజుకు 2.1 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా, 14.65 లక్షల క్యూబిక్ మీటర్ల ఓర్డెన్ తొలగింపు లక్ష్యంగా పనిచేయాలని చెప్పారు. దేశవ్యాప్తంగా బొగ్గుకు డిమాండ్ పెరుగుతోందని, ఆ అవకాశాల్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. అన్ని ఏరియాలకు అవసరమైన యంత్రాలు, అనుమతులు, ఒబి కాంట్రాక్టులు ఇప్పటికే సమకూర్చామని, వర్ష ప్రభావమూ ఉండే అవకాశం లేదని అన్నారు. వచ్చే వారం రోజుల్లో ఓపెన్ కాస్ట్ క్వారీల్లో నిలిచి ఉన్న నీటిని బయటకు తోడి పోసి, బొగ్గు ఉత్పత్తి, ఓవర్ బర్డెన్ తొలగింపు చేపట్టాలని ఆదేశించారు. సింగరేణి ఉద్యోగులకు ఒకేసారి రూ.1,750 కోట్ల వేజ్ బోర్డు బకాయిలు చెల్లించామని, లాభాల్లో 32 శాతం బోనస్ రూ.711 కోట్లను దసరా పండుగకు ముందే విడుదల చేస్తామని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు ఎన్ బలరామ్, డి సత్యనారాయణరావు, ఎన్‌వికె శ్రీనివాస్, జి వెంకటేశ్వరరెడ్డి, అడ్వయిజర్ (ఫారెస్ట్రీ) సురేంద్ర పాండే, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) జె ఆల్విన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రణాళికలో మత్స్యకారుల సమస్యలు పొందుపర్చాలి

తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల ప్రణాళికల్లో మత్స్యకారుల, కార్మికుల సమస్యలు పొందుపర్చాలని, వారి సంక్షేమానికి రూ. వెయ్యి కోట్లు కేటాయించి ప్రణాళికా బద్ధంగా ఖర్చు చేయాలని అఖిల భారత మత్స్యకారులు, మత్స్యకార్మిక సమాఖ్య జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లలోని రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్య కారుల సంక్షేమానికి ఎన్నికలకు ముందే ఎన్‌సిడిసి ద్వారా రూ. 1000 కోట్లతో 64 రకాల సంక్షేమ పథకాల అమలు చేసి మత్స్యకార కుటుంబాలని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి మత్స్య సోసైటికి రూ. పది లక్షల ఆర్థిక సహాయం చేయాలన్నారు. మత్స్య మహిళా సోసైటిలకు రూ.ఐదు లక్షలివ్వాలని, 50 ఏళ్లు నిండిన ప్రతి మత్స్యకారుడికి రూ. ఐదు వేల వృద్ధాప్యపించను ఇవ్వాలని డిమాండ్ చేవారు. మత్స్యకారులకు ఎంతో మేలు చేస్తున్నట్టు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుందని, అదంతా ప్రచారమేనని విమర్శించారు. వాస్తవంగా క్షేత్ర స్థాయిలో మత్స్యకారుల పరిస్థితి కడు దీనంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో వారికి మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకుంటున్నారని, ఆ తర్వాత వారికిచ్చిన వాగ్దానాలు మరిచి పోతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మురారి మోహన్, చనమోని శంకర్, రాష్ట్ర కార్యదర్శులు ఎం రమేష్, గొడుగు వెంకట్, రాష్ట్ర నాయకులు సిహెచ్ వెంకన్న, బొడ్డు బాల సైదులు, బక్క బాలమణి, చంద్రి పుష్ప, కె లక్ష్మి, ఎస్ మంగమ్మ తదితరులు పాల్గొన్నారు



సమాజ చైతన్యంలో నాటక రంగం ఎనలేని పాత్ర : ఆనందాచారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాజాన్ని చైతన్య పరచడంలో, విజ్ఞానవంతం చేయడంలో నాటక రంగం నిర్వహించిన పాత్ర ఎనలేనిదని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ సాహితీవేత్త కటుకోజ్వల ఆనందాచారి అన్నారు. నల్లగొండలోని ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన తంగిరాల కృష్ణ ప్రసాద్ స్మారక రంగస్థల పురస్కార ప్రదానోత్సవములో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ శ్రీశ్రీ లాంటి వైతాళికులైన కవులు ఏ అవార్డులను ఆశించకుండా సమాజాన్ని జాగతం చేశారని అట్లా నిరాడంబరంగా నాటక రంగం ద్వారా కృషి చేసిన కష్ణ ప్రసాద్ స్మారక పురస్కారాన్ని అదే తరహాలో నేడు సంగీత సాహిత్య నాటక రంగాల్లో కషి చేస్తున్న పురుషోత్తమాచార్యులకు ఇవ్వడం అభినందించదగ్గ విషయం అన్నారు. తంగిరాల చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన ప్రముఖ రంగస్థలం నటులు కళా రత్న చింతా వెంకటేశ్వర్లు, ప్రముఖ సాహితీవేత్త పుప్పాల కష్ణమూర్తి, అనంతోజు మోహనకష్ణ , కోయ చంద్రమోహన్, సాగర్ల సత్తయ్య, మేరెడ్డి యాదగిరి రెడ్డి, పెరుమాళ్ళ ఆనంద్, బూరుగు గోపికృష్ణ, ఏభూషి నరసింహ మహమ్మద్ హసీనా, ఆలూరు విల్సన్, కోమటి మధుసూదన్, నామ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రుణ'మాఫీ' అయ్యేదెప్పుడో..!

- ఎన్నికలు సమీపిస్తుండటంతో రైతుల్లో ఆందోళన
- డిఎఒ ఆఫీస్, హెల్ప్‌సెంటర్‌కు క్యూ
- ప్రాసెస్‌లో ఉందని ఎఒల సమాధానం
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా నిష్ప్రయోజనం



రుణమాఫీ కోసం బ్యాంకులకు వచ్చిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రూ.లక్షలోపు పంట రుణాల మాఫీ విషయంలో ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. 2018 ఎన్నికల సమయంలో ప్రతి రైతుకు రూ.లక్షలోపు రుణమాఫీ అన్న ప్రభుత్వం మళ్లీ ఎన్నికలు వచ్చేంత వరకు దీన్ని సాగదీసింది. రైతును పరిగణలోకి తీసుకోకుండా కుటుంబం మొత్తానికి రూ.లక్ష మాఫీ చేసింది. అగ్రిగోల్డ్ లోన్స్‌ను సైతం మాఫీ చేస్తామని నాడు ప్రకటించినా నేడు దాని ఊసే లేదు. కుటుంబం ప్రాతిపదికన సెప్టెంబర్ 16వ తేదీలోపు వందశాతం రుణమాఫీ ఇస్తామని గడువు పెట్టింది. కానీ నిర్దేశిత తేదీలోపు 25శాతం మంది రైతుల రుణాలూ మాఫీ చేయలేకపోయింది. జాప్యానికి సాంకేతిక కారణాలను సాకుగా చూపుతోంది. వారం, పది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆధార్‌కార్డు, బ్యాంకు పుస్తకాలు పట్టుకుని జిల్లా సమీకృత భవన సముదాయాల్లోని జిల్లా వ్యవసాయశాఖ అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అక్కడి హెల్ప్‌డెస్క్‌లో వాకబు చేస్తే ప్రాసెస్‌లో ఉందనే సమాధానం వస్తుంది తప్ప.. మాఫీ కావడం లేదు. బ్యాంకులకు వెళ్లినా ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వ ప్రకటనలకు క్షేత్రస్థాయి పరిణామాలకు పొంతన లేకుండా ఉందని మండిపడుతున్నారు. ప్రభుత్వ గణాంకాలకు వాస్తవ పరిస్థితులకు కూడా పోలిక లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

సాంకేతిక సాకులు..

రుణమాఫీ సమస్యలకు సాంకేతిక సాకులను ప్రభుత్వం చూపుతోంది. 'సాంకేతిక కారణాల వల్ల కొంతమంది రైతులకు అందాల్సిన డబ్బులు బ్యాంకుల నుంచి వెనక్కి వచ్చాయని మంగళవారం వ్యవసాయశాఖ మంత్రి ఎస్ నిరంజన్‌రెడ్డి ప్రకటన విడుదల చేశారు. రుణమాఫీ సమస్యల పరిష్కారం కోసం టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. రుణమాఫీపై సందేహాలుంటే 040-23243667 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా రూ.12,617 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసినట్టు ప్రభుత్వం పేర్కొంది. తద్వారా 22.46 లక్షల మంది రైతులు లబ్ది పొందారంటోంది. ఇంకా 7.15 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,400 కోట్లు మాత్రమే జమ చేయాల్సి ఉందంటోంది. అర్హులైన ప్రతిరైతుకూ రుణమాఫీ అందుతుందని చెబుతోంది. గణాంకాలు బాగానే ఉన్నా క్షేత్రస్థాయి పరిశీలనలో దీనికి భిన్నమైన పరిస్థితులు ఉన్నాయి. ఒకే వ్యక్తికి ఒకటికి మించి బ్యాంకుల్లో రుణాలు ఉంటే ఏ బ్యాంకులోది పరిగణలోకి తీసుకోవాలో ఇంత వరకూ స్పష్టం కాని పరిస్థితి. అర్బన్ బ్యాంకుల్లో క్రాప్‌లోన్ తీసుకున్న రైతుల పరిస్థితి కూడా గందరగోళంగా ఉంది. ఫ్యామిలీ గ్రూపింగ్ కూడా కష్టతరంగా మారింది. ఒక కుటుంబంలో నలుగురికి లోన్లు ఉంటే ఎవరి రుణాన్ని పరిగణలోకి తీసుకోవాలో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. సహకార సంఘాల్లో పంటరుణాలు తీసుకున్న కొందరు రైతుల లోన్ అకౌంట్ నంబర్లతో పాటు ఆల్ఫాబేట్స్‌నూ జత చేశారు. అలా అంకెలకు ఇంగ్లీష్ అక్షరాలను జోడించి లోన్‌అకౌంట్ నంబర్ ఇచ్చినా మాఫీ వర్తించలేదు. ఖమ్మం జిల్లాలో పదికి పైగా సహకార సంఘాల్లో ఇంత వరకూ ఒక్కపైసా కూడా జమకాలేదు.

ఖమ్మం జిల్లాలో మాఫీ కటకట..

ఖమ్మం జిల్లాలో రుణమాఫీ కష్టంగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 3.21 లక్షల మంది రైతులకు గాను ఇప్పటి వరకు 89,093 మంది రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. అంటే నూటికి 29 మంది రుణాలు మాత్రమే మాఫీ కాగా ఇంకా 70 శాతం మందికి పైగా ఎదురుచూస్తున్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం రూ.2,430 కోట్లు మాఫీ కావాల్సి ఉండగా రూ.374 కోట్లు మాత్రమే సోమవారం నాటికి మాఫీ అయ్యాయి. ఇంకా రూ.2,056 కోట్ల రుణాల మాఫీ కోసం 2.31 లక్షల మందికి పైగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటి వరకు రూ.50 వేల నుంచి రూ.1.22 లక్షల మధ్య ఉన్న రైతుల రుణాల్లో రూ.లక్ష లోపు మాఫీ చేశారు.

మంత్రి ఇలాకాలో 'గ్రామీణ బ్యాంకు' రైతుల ఇక్కట్లు..

ఖమ్మం జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నియోజకవర్గంలోని పాపటపల్లి, జికె బంజర, విఆర్ బంజర, చిమ్మపూడి గ్రామాల్లోని 1821 మంది రైతులు ఖమ్మం నగరంలోని ఎపిజివిబి బురహాన్‌పురం బ్రాంచీలో రూ.లక్షకు పైగా రుణం తీసుకున్నారు. కానీ ఇప్పటి వరకు కేవలం 411 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయింది. వారంరోజుల్లో ఎన్నికల కోడ్ వస్తే పరిస్థితి ఏమిటని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఒక్క బ్యాంకులోనే ఉన్నా మాఫీ చేయలేదు..

బాణోత్ లింగా, ఆరెకోడుతండా,

నాకు ఎపిజివిబి బ్యాంకులో రుణం ఉంది. రూ.లక్ష తీసుకుంటే అది రూ. రెండు లక్షలయింది. బ్యాంకు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవట్లేదు. వ్యవసాయాధికారి కార్యాలయానికి వెళ్లమంటే కలెక్టరేట్‌కు వచ్చా. ప్రాసెస్‌లో ఉందని చెప్పారు. ఇప్పటి వరకు రూ.1.25 లక్షలలోపు ఉన్న రుణాల్లో రూ.లక్ష మాఫీ అయ్యాయంటున్నారు. రూ. రెండు లక్షల వరకు మరికొంత సమయం పడుతుందం టున్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. మాఫీ అవుతుందో లేదోనని భయంగా ఉంది.